# కుంపటి

కార్మిక

ఆదేమికోపమోకాని పొద్దటినుంచి లచ్చిమి కోపముతోటి చిర్రుబుర్రులాడు తూనే ఉంది. లేపిలేపటముతోటి మొగడు చంద్రియ్యతో దెబ్బలాడింది. "కాళ్ళు సాపుకొని అట్లాపంటే తిండిఎట్లా- గీ పస్తులుండుడు నావల్లకాదు. కోమటోడు కాతా మీద సరుకులియ్యనన్నడు. పోయిననెల బాయిస్త్రైకుండి జీతము సరిగారాలేదంటే యింటడా- ఏమన్ననా.... అందరు గిట్లనేసెపుతాండ్లు. నాకు బాకిపెట్టినోనికి నేనేమి చెప్పాలి. పోయిననెల గింతేనాయే. ఇప్పటికి ఇంక నాలుగునూర్లు రెన్నెల్లకాస్నుంచి నయాపైప యిచ్చుడెలేదాయె. అంటు గింజలుపోసేదిలేదంటు ఖచ్చితంగా చెప్పిండు" బడబడ వాగుతున్న లచ్చిమి మాటలు వినిపించినా వినిపించుకోనట్టు లేపి ఎటో పోయిండు చంద్రియ్య

లచ్చిమి తనలోతనే ఏదోగునుక్కొంది. ఎటుతోసక పొల్లగాడేడిస్తే దబ్బడ దబ్బడ నాగ్గేపింది. వాడులబోడిబోమంటే మళ్ళీవాన్ని బుజ్జగించింది. ఇంట్లో కుండ లన్ని ఎతికితే అర్ధసేరు నూకలున్నయి. అవైనా గాలిస్తామంటే అంపలికుండల కాడ నీల్లులేవు. "ఓపోరి కుండెడు నీల్లుతీసుకొస్తె ఏమైద్దె. గింత గింత పోరగాండ్లు చిన్న చిన్న చేతులుపెట్టుకొని చిట్టర చిట్టర పనిచేస్తరు. నీకెమిపట్టిందె చిందమెత్తు సారగము చెయ్యవు" కూతురు మల్లవ్వను కసురుకుంది.

"నన్నెక్కడ పట్టుకోనిస్తరె నల్లకాడ మనెత్తున్న తుర్కది లొల్లిపెట్టు కుంటాండ్లు. గంటసేపున్న నీల్లపట్టుకోనియ్యలె" నాదేమి తప్పులేదన్నట్టు మల్లవ్వ చెప్పింది.

లచ్చిమి అంపలికాడి కుండను పట్టుకొని నీల్లకుపోయింది. మల్లవ్వ చెప్పి నట్లు వాడవాడంతా నల్లదుష్టే గుమికూడిండ్లు సన్నగా పొల్లగాడు ఒంటేలుకు పోసినట్లు నల్లనీల్లు ఒక్కకుండనిండటాల్లకె జాముసేపయితాంది.... ఇప్పుడప్పుడే తన్నుపట్టు కొనిచ్చెట్టులేరని వంతుకు కుండేసి మళ్ళీ గుడిసెగుచ్చింది. మళ్ళీ పొల్లను గదిమింది వంతుకు వచ్చినంక నీల్లుపట్టుపొమ్మని" మల్లమ్మ నీల్లకుపోయింది.



బొగ్గుపొయ్యి అంటేస్తమంటే ఇంట్ల బొగ్గులేదు పక్కింటి కొమరక్క ఇంటికి పోయింది "అక్కబొగ్గున్నదా" అని "లేదుచెల్లే బాయినడిసై ఆయన సైకిలుకు ఇంత

పెల్లపెట్టుకొనితెచ్చేటోడు బాయిబందయి పదిహేనురోజులాయెనా.... ఉన్నదిలేనిది అంతఊడ్చి నేనేబొగ్గుపొయ్యివేసిన.... ఇంకా మాపటికిఎట్లనో" అందిలేదన్నట్టుగా

"అదిపరెగానిఅక్క! ఇంక బాయిలు ఎన్నిరోజులు బందుంటయాట. గిట్లయితె బువ్వతిన్నట్టే పోయిననెలల లాడీసాయనకు బొగ్గుపెల్లపడి కాలువిరిగిందని.... కాలు యిర్గి నాయనకు సర్ పేస్‌వర్కుకావాలని రెండువారాలు బందయిందా.... దాంతో ఆ నెలల సగము జీతముకూడ సరిగా రాకపాయే మళ్ళీ ఏమిముంచుకొచ్చిందో"

"అదేందో పనిచేసే పేసుల్ల మందిని ఎక్కువ పెట్టేండ్లట"

"అంటేందక్కా" లచ్చిమి అర్థముకాక అడిగింది.... కాని కొమురక్కకు కూడా పూర్తి వివరాలు తెల్వదు దాంతో నాకుకూడ తెల్వదన్నట్టు మొఖము పెట్టింది.

కాని వాకిట్లో పండుకున్న సాయిలు పరాసికంగా "అక్కచెల్లండ్లు ముచ్చటాడు కున్నట్టను కుంటాండ్లాఏంది? బాయిపనంటే" మంచముల పండుకొనే పక్కుయికిలిస్తు వాళ్ళకేసి తిరిగిండు. "అ! బహుకష్టపడుతాండ్లు ఉత్తగున్నదిమేమేనా బాయి ఎందుకు బందున్నదో తెలిస్తెచెప్పరాదు....లేకుంటే ఊకోరాదు" కొమురమ్మ మొగన్నిదెప్పింది

సాయిలు వాళ్ళమీదినుంచి దృష్టిమళ్ళించుకొని వెలికిల్లా పండుకొని పందిరి గుంజకేసిచూస్తు చెప్పుకొచ్చిండు "కంపినోనికి మారెక్కలకష్టమెట్లా పిండుకోవటము, ఎలాగు లాబాలు పెంచుకోవటము ఉత్పత్తి పెంచటము, ఎట్లా అన్నఆలోచన తప్ప కార్మికుడు ఎట్లపనిచేస్తాండు- వాని కష్టసుఖాలేమిటన్నజాస వాడికెందుకు. కసాయోని తీర్గ కంపినోడు. మా నెత్తురు పిండుకొంటాండు. అందుకు కొత్తకొత్త పద్ధతులు పెడుతాండు. యూనియనోడు ఇదేందిఅని అడుగుతలేదు. మొన్న మా బాయిల వర్కింగ్ పేసుల పదిమంది ఉండే వర్కింగ్ పేసుల్ల పన్నెండుమందిని పెట్టిండు. పన్నెండుమంది లాడీనోల్లు మనిషి రెండుటబ్బులు నింపితేకాని కూలిగిట్టదు. పేసుల్ల యిరకాటమైతది. కోల్‌కట్టరు ఇదివరకంటే పొక్కలు ఎక్కువకొట్టాలి. షార్టు పైరర్స్ అంతే. టబ్బులసంగతి సరెసరే అవిసరిగా అందయి. దాంతో లాడీ నోనికి కూలిగిట్టదు. లాడీనోనికి కూలిగిట్టినా గిట్టకపోయినా, కోల్‌కట్టర్స్‌లోని, షార్టుపైరర్లతోని సర్దార్లతో ఎక్కువపనిచేయించుకోవచ్చు. ఇదివరకు పదిమందికి చేసేకాడ ఇప్పుడు పన్నెండుమందికి పనిచెయ్యాలె అంటె వాళ్ళమీద వర్కులోడు పెరిగింది. పేసుల్లరద్దీఎక్కువై మనిషికి మనిషిరాసుకుంట తిర్గుడయితాంది. లేబరోడు ఎట్లనత్తేంది మాకు పొల్యూషన్ రావాలంటడు కంపినోడు పేసుల్ల. పదిమందికంటే

704

ఎక్కువపెట్టద్దని చట్టముకూడఉంది. కంపినోడు చట్టాన్ని కాతర్‌చేయకున్నా ఇదేం దని యూనియన్‌వాడు అడగుతలేడు. ఇకభరించలేక మేమే బాయిబందుపెట్టినము" సమ్మెందుకు జరుగుతుందో సాయిలుచెప్పేసరికి ఒక్కక్షణం ఏటుతోచిందికాదు లచ్చిమికి. 'ఏంబతుకులో పాడుబతుకులు' అనుకుంట మళ్ళీ ఇంటికొచ్చింది.

మల్లవ్వ నీల్లకుండపట్టుకొచ్చి అంపలికాడపెట్టింది. బొగ్గుపొయ్యి అంటించా లన్న జాసకొచ్చి "బిడ్డా కాస్త సిఎస్‌పి కాడికన్నపోయి ఓ తట్టెడు బొగ్గుతీస్కరావే నీ కాల్లుమొక్తగని" బతిమాలుతున్నట్టుగా.

"అక్కడ బొగ్గు తీస్కరానియ్యరే. వాచ్‌మన్ ఉంటడు. చూస్తె కొట్టతానికి వస్తడు నేనుపోను" అంది మల్లవ్వ మారాముచేస్తు.

'మాఅవ్వ మంచిదానవుకాదుబిడ్డా ఎట్లయినాపోయి గీ తట్టెడు తీస్కరాపో. పొయ్యిఅంటెయ్యకుంటే బువ్వఎట్లతింటవు' బుజ్జగిస్తూ తట్టచేతికిచ్చింది.

మల్లవ్వ గుసుసుకుంటా, మారాముచేసుకుంటనే తట్టతీసుకొన్నది. దండానికి ఉన్న పాతరైకను సుట్టబట్టకోసమని తీసుకున్నది.

మే మాసము ఎండ. ఉదయము సూరీడు బారెడుపొద్దెక్కగానే ఎండ చురచుర లాడుతుంది. రోడ్డుమీదపర్చుకున్న నల్లటిబొగ్గుదుమ్ము కొద్దికొద్దిగా వేడెక్కుతుంది. బావులు బందుండటమువలన ఆ రోడ్డుమీదతిర్గే కంపినిలారీలులేక రోడ్డునిశ్శబ్దంగా ఉంది. అటుఇటుపోతున్న మనుష్యులు తాపీగా నింపాదిగాపోతున్నరు. బావులు నడిచి నప్పుడున్న తొందర ఇప్పుడెక్కడిది?

మల్లవ్వ గుడిసెలనుంచివచ్చి సి. ఎస్ పి. రోడ్డుఎక్కింది. వోవరుబ్రిడ్జిమీదికొచ్చి సి.ఎస్.పి. కేసి చూసింది. అక్కడొక్కటి ఇక్కడొక్కటి లారీలు స్టాకుకోలు నింపు కొంటున్నాయి. మన్నుతిన్నమంజరలా సి.ఎస్.పి నిశ్శబ్దంగాఉంది సిఎస్‌పి నడిచినప్పు డుండే బడబడ సప్పుడుగాని, ఆకాశానికిఅంటే నల్లటి బొగ్గుధూళిగానిలే ఎండకు ప్రతిఫలిస్తుంది.

మల్లవ్వ తట్టపట్టుకొని రోడ్డుదిగి ఎగుడు దిగుడు నేలమీదుగా బావులునడిపినా నడవకున్నా ఎప్పుడుపారే మురికికాలువ పక్కగానడిచింది. సి.ఎస్ పి.కంటే ముందు వచ్చే "బంకరు"కాడ చూసింది బొగ్గుఏమన్నా అగుపిస్తుందోఏమోనని కాని బావులు

705

బందుండటము మూలంగా 'బంకరు'కాడ ఊడ్చినట్టుగా నోరుమూసుకున్నదయ్యం తీర్గ నేలకేసి చూస్తుంది. బంకరుమీద మనుష్యులున్నజాడ కనిపించలే. బంకరు పక్కగా సి ఎస్.పి. కేసి నడిచింది.

సి.ఎస్.పి. పక్కన బావులు బాగనడుస్తున్నప్పుడు రైల్వేవ్యాగన్ల సప్లయి సరిగా లేనప్పుడు 'డంప్'చేసిన బొగ్గు కుప్పలు కుప్పలుగాఉంది. ఆ కుప్పలు ఎటుఫర్లాంగు దూరమువరకు పరుచుకొని ఉన్నాయి. ఆ బొగ్గుకుప్పల చివరన స్టాక్‌కోల్‌ను లిఫ్టు చేస్తున్న లోడరుచప్పుడుతప్ప అంతా నిశ్శబ్దంగాఉంది.

మల్లవ్వ అటుఇటుచూసింది. ఎవరులేరని నిర్ధారించుకొని ఓ కుప్పచాటుకు కూసొని తట్టలోకి బొగ్గునింపుకొంటుంది.

కాని వేబ్రిడ్జుపక్కన గోడకుఆనుకొని స్టూలుమీదఃకూచున్న ముసలి 'వాచ్ మన్' అదేపనిగా దవడలు లొట్టలుపడంగ సుట్టకాల్చుకుంటు నింపాదిగా కూచున్నోడు తన గద్దచూపుతో బొగ్గుఎత్తుతున్న పొల్లను చూసిండు. చూసినోడు ఇక్కడినుండే కేకవేస్తే పారిపోతుందని బొగ్గు దొంగతనముచేస్తున్న పోరినిపట్టుకొని సీనియర్ ఇన్‌స్పెక్టరుముందు హాజరుపర్చి ముసలోడైనా మంచిపనోడు అనిపించుకోవాలనో ఏమో? మెల్లగా పిల్లిలా అడుగులువేసుకుంటు లాటీపట్టుకొని బయలుదేరిండు. కంగారుగా తట్టలోకి బొగ్గునింపుకుంటున్న మల్లవ్వ చిన్నగా ఏదోఅలికిడి అయ్యే సరికి తలెత్తి చూసింది. ముసలివాచ్‌మన్ దగ్గరికి రానేవచ్చిండు. ఒక్కక్షణం భయంతో వణికిపోయింది. గబుక్కున తట్టను అక్కడేకుమ్మరించి తట్టందుకొని పరుగుపెట్టింది. ముసలివాచ్‌మన్ 'ఓపోరీ ఆగు'అని అరిచిండు. కాని ఆగకుండా అదేతీరుగా పరుగెత్తుతున్న అమ్మాయినిచూసి తను పరుగెత్తి పట్టుకోలేనని నిర్ధా రించుకొని పరిగెత్తుతున్న మల్లవ్వకేసి చేతిలోని లాటీని రువ్వింది.

రివ్వున లాటీ మల్లవ్వకు తాకకుండా పక్కగావచ్చి మల్లవ్వకంటేముందే పడింది. ఆ లాటీయేకనుక తాకేదుంటే అడ్డముపడిపోయేది. కాని తప్పిపోయింది. ముందుపడ్డ లాటీనిచూసి భయంతో ఇంకా బాగాపరుగెత్తింది....

వోవరుబ్రిడ్జిరోడెక్కి వెనక్కితిరిగిచూసి 'అమ్మయ్య' అంటు అప్పుడు నిట్టూర్చింది. వాచ్‌మన్ వెంటరావడంలేదని నిర్ధారించుకొని ఆయాసంగా మెల్లగా నడవటము మొదలుపెట్టింది. వోవరుబ్రిడ్జిమీదికొచ్చి చూసేసరికి సి.ఎస్.పి ఈవలివైపు

706

లోడ్ చేయబడిఉన్న రైల్వేవ్యాగన్లనుండి కొంతమందిబొగ్గు ఎత్తుకపోతున్న దృశ్యము కళ్ళపడ్డది. కాస్త చెమ్మగించి పరకాయించి చూసింది. పది పదిహేనుమందిదాక వ్యాగన్లనుండి బొగ్గు తట్టల్లోతీస్కపోతుంటే చూసి 'ఎలాగైనా ఇంటికి బొగ్గు తీస్కరమ్మ"న్న తల్లిమాటలు గుర్తుకొచ్చి.... ధైర్యము తెచ్చుకొని మళ్ళీ రోడ్డుదిగి ఈసారి వ్యాగన్ల కేసినడిచింది.

సి ఎస్. పిలో 'లోడ్' అయిన బర్తి వ్యాగన్లపైకిఎక్కి కొన్నిబొగ్గుపెల్లలు క్రిందికి రాల్చి.... రాల్చినబొగ్గును తట్టల్లోకి నింపుకొంటున్నారు. అక్కడ వాచ్‌మన్ ఎవరు ఉండరని వ్యాగన్లకాడికొచ్చింది.

అప్పటికే తట్టల్లో బొగ్గునింపుకున్నవాళ్ళు మెదలిర్గిపోతయా అన్నట్టుగా అఘాచ్చనతో బరబర ఎల్లిపోతాండ్లు. మరికొంతమంది వ్యాగన్లనుండి బొగ్గుపెల్లలు క్రిందకు పడదోస్తుంటే తట్టల్లోకి ఏరుతున్నారు మరికొంతమంది.

మల్లవ్వ అతికష్టముమీద వ్యాగిన్ పైకెక్కింది.... తన చిన్నచిన్న చేతులతో బొగ్గుపెల్లలను క్రింద తోస్తుంది.

అంతలకే కలకలము బయలుదేరింది.... ఉరికినోల్లు ఉరికిండ్లు.... ఉరకనోల్లు దొరికిండ్లు.... మళ్ళా, సేలు రాయిరప్పలు ఎత్తుగాగుట్టగా పోసికున్న కుప్పసాటునుండి రైల్వేసిబ్బంది దాదాపు పదిమంది తూతాత్తుగా దాడిచేసి దొరికినోల్లను దొరికినట్టుగా పట్టుకున్నరు.

వ్యాగన్‌పైనున్న మల్లవ్వకు ఈ సంఘటనచు సీ ప్రాణంపైన్నే పోయినంత పనయింది.... ఏడ్వటము మొదలుపెట్టింది

"దొంగపోరీదిగు సోయగాల ఎడ్పుఏడుస్తానవు" గడ్డము మీసాలను సోగ్గా పెంచుకున్న రైల్వేఉద్యోగి అరిచిండు....

భయంతో యింకా బాగా ఏడ్వటము మొదలుపెట్టింది.

"నీయవ్వ....దిగుతవా....లేదా.... లేకుంటే రాయితో యిసురత దిగునీయవ్వ" రైల్వే యునిఫారమ్ వేసుకున్న నల్లటోడు బెదిరించిండు.

అయినా మల్లవ్వ ఏడ్పుఅపలే వ్యాగన్‌దిగలే

దొరికినోర్లందరిని వరుసగా నిలబెట్టిండుఒకడు. వాళ్ళెక్కడికి పారిపోకుండా మరోసర్గురు కాపలాకాస్తున్నరు.... దొరక్కుండా పారిపోయినోల్లు దూరంగా ఉంది

707

చోద్యంచూస్తున్నరు. వ్యాగన్ ఎక్కిన రైల్వేఉద్యోగి మల్లవ్వ రెండు జబ్బలు పట్టుకొని జారవిడిచిండు.... కిందపడ్డ మల్లవ్వ కడుపులపేగులు తెగిపోయేట్టు ఏడుస్తూనే ఉంది. ఇందాకటి రైల్వే యూనిఫాంమ్ వేసుకున్నవాడు "నీయవ్వ పోరి ఊకుంటవా లేదా" అంటు ఒక్కటి సరిచిండు.... మల్లవ్వ బెదిరిపోయి మూతిముడుచుకొని ఎక్కి ఎక్కి పడ్తాంది....

తెల్లబట్టలేసుకొని ఇన్‌షర్ట్ వేసి బెల్టుపెట్టుకున్న నడీడుమనిషి 'కొట్టకు' అని వారించిండు.

దొరికినోల్లందరిని ఒకచోటనిలబెట్టిండ్లు. వారిలో ఆస్మాన్‌రంగు రెక్కల బనీను వేసుకున్న ముసలోడు "బాంచెన్ ఏంచేత్తరు.... ఏదో పొయ్యిలకు పెల్లలు లేవంటే రెంటికచ్చినోన్ని రెండుపెల్లలు పట్టుకపోతనని వచ్చిన బాంచెను ఇడ్సిపెడ్తె యింటికిపోతా.... మరోసారి ఈచాయలకురాను బాంచెను" అంటు తెల్లబట్టలాయన్ను ఉద్దేశించి రెండుచేతులు జోడించి దండంపెట్టు బతిమాలిండు.

'ఈ దొంగనాటకము సాలు. ఇది నీఅవ్వమిండందని బొగ్గు తీస్కపోను వచ్చినావురా ముసలోడా. బొగ్గుఎత్తుకపోయి అమ్ముకుంటామని కాదురా' జర్దానోరు కస్పర బిస్పర నములుకుంటు కసిరిండొకడు.

'అవ్వతోడు పొయ్యిఅంటిస్తమంటే బొగ్గుపెల్లలేకుంటె వచ్చిన.... ఇంకోసారి ఈ తప్పుచేయముసార్' పెయ్యిమీదఅంగిలేని లేబరాయన అన్నాడు.

"అయితె ఇంకోసారి మేము పట్టుకోము సరెనా" అంటు జవాబిచ్చిండు అంతవరకు ఒక్కమాటయిన మాట్లాడని బోడిమూతాయన.

ఇదంతా ఏమి అర్థముకాని ముసల్ది ఒకతి "పట్టకపోయి ఏంచేస్తరయ్యా" అంది దీర్ఘముతీస్తూ.

"అత్తగారింటికి తీస్కపోతము" యూనిఫామ్‌వాని జోక్‌కు కిసుక్కున నవ్వెండు ఇంకొకడు.

ముసల్దానికి కోపమొచ్చింది నింపుకున్న బొగ్గుతట్టను కుమ్మరించి "నీబొగ్గు నేనేమి తీస్కపోతలేను".... పోబోయింది.

"ఎక్కడికి పోతానవు అత్తగారింటికి రానంటే ఊకుంటరా గుంజుకపోతరు" ఎటకారంగా పల్లికిలిస్తు అన్నడు యిందాకటివాడే.... ముసల్దాని ఒళ్ళుమండి ముందుకు పోబోయింది.

708

ముందుకుపోతున్న ముసల్దాని చెయ్యిపట్టిలాగిండు రైల్వేపోలీసు.... ముసల్ది అడః పుకు కూలబడి కోపంతో నీచేతులకు జెట్టలుపుట్ట.... ఎంతగనము పదేస్తివికదరో నిన్నెత్తుకపోను.... అంటు శాపనార్థాలుపెడ్తుంది....

పోలీసోడు కోపంతో లాటీ ఎత్తిండు

ముసల్ది అదిచూసి ముందుకొస్తు "కొడ్తావురా....కొట్టు ఎందుకు కొడ్తవురా నీఇంట్లకెల్లి ఏమన్నావెత్తుకొచ్చినానురా నీఇంట్ల పీనుగెల్లా నా నడుము యిరగ్గొడ్తివి కదరో...." అంటూ ఆయాసంగా మూల్గింది.

లాటిఎత్తిన పోలీసోడు ఏమనుకున్నడో ఏమో లాటిదించిండు,

ముసల్ది అదే పనిగా ఊరుపేరు లేకుండా తిడ్తూనేఉంది.... "బాయిల పన్జైసె టోనికి కుంపటి రాజేసుకుంటమంటే బొగ్గుకరువైంది మేమేమన్న దొంగతనంగా లారీలకు లారీలు వ్యాగన్లకు వ్యాగన్లు అమ్ముకుంటానమా గట్లలారీలకు లారీలు అమ్ముకునోడు సుఖంగనే ఉన్నడు. వ్యాగన్లు వ్యాగన్లు మాయమైపోయినప్పుడు ఎము పోయింది ఈ తెలివి. పొయ్యిలకు నాల్గుపెల్లలు తీస్కపోతే దొంగతనమైందా "

ముసల్ది ఆదేపనిగా ఏమో వదురుతూనే ఉంది.

అంతలకే మరోరైల్వే ఉద్యోగి ఖాళీగాపోతున్న లారీనిఆపి అందరిని అందులో బలవంతంగా ఎక్కించుకొని బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌కు లారి పోనిచ్చిండు

వాడవాడంతా అట్టుడికిపోయింది. లచ్చిమికి ఎవలపోల్లగాడోవచ్చి 'మీ మల్లవ్వనుకూడా పట్టుకపోయిండ్లని' చెప్పేసరికి ఎక్కడలేని ఏడుపువచ్చింది. ఏడుస్తూనే ఊరుపేరులేకుండా శాపనార్థాలు పెట్టింది, "వాళ్ళచేతులకు సరుప్పలుపుట్ట పోలగాండ్లని సూడకుండా పట్టుకపోయిండ్లు.... వాళ్ళనుఎత్తుకపోను, వాళ్ళకుగత్తరరాక." తిడ్తూనే బిడ్డను ఏంచేస్తరో ఏమో అంటూ దీర్ఘాలుతీస్తు ఏడ్చింది.

పక్కింటిసాయిలు వాకిట్లోకివచ్చి "ఎందుకుఏడుస్తావు. సావకొడ్తరా. పట్టుకపోయినోళ్ళ వాళ్ళె యిడ్చిపెడ్తరు. ఏడుస్తె ఏమొస్తది. చంద్రిన్నడుంటే బెల్లంపల్లికి పంపుతే ఏసంగతి తెలుసుకొస్తడు." అంటూ ధైర్యముమాటలుచెప్పినా కాని మనసులో ఒకమూల పీకతూనేఉంది. పట్టుకపోయినోల్లను కోర్టులో హాజరుపర్చి దండుగ వేస్తరని కాకుంటే జైలుకుకూడ పంపిస్తరని తెలుసు అయినా ఏమైతె అది అవుతుందిలే అని తనలోతనే సమాధానపడ్డడు చివరికి" "మస్టరు ఏసుకోసు పోయి నోడింకారాలేదా"

709

"ఏడసచ్చిండో ఏమో" లచ్చిమి.

"జరనువ్వన్నాపోయి జాడ తెల్సుకరారాదు. బాయిబందున్నదికదా అని తీరిపారి వస్తడు" కొమురమ్మ మొగన్ని పురమాయించింది.

లచ్చిమి కుడ్తిలపడ్డ ఎల్క-తీర్క- గిజగిజలాడింది. బుర్రిఏమిపన్జెయలేదు.... అదేపనిగా ఏడుస్తుండిపోయింది.

సరే నేను బాయిదాక పోయివస్తానంటు" సాయిలు చంద్రియ్య జాడకు పోయిండు. పొద్దున మస్టరేసుకొని వస్తానని బాయిమీదికిపోయిన చంద్రియ్యకు బాయి మీద కాకిబట్టల పోలీసులు లాటీలు ఊపుకుంటు దర్శనమిచ్చిండ్లు.

ఆ రోజైనా బాయినడిపించాలని స్ట్రైక్ పెయిల్ చేయాలని ప్రియత్నచేంస్తున్న మేనేజుమెంట్ చివరికి యూనియన్ నాయకులను పిలిపించింది. యూనియన్ నాయకులకు కూడ కార్మికులమీద మంటగానేఉంది. ఎందుకంటే 'కార్మికులు రోజు రోజుకు తెలివిమీరిపోతాండ్లని. నాయకుల్ని లెక్క-చేయటములేదని సడమంత్రిపు సిరి గాండ్లు బాయిలమీదికివచ్చి బాయిలు చెడగొడుతాండ్లని. ఇదంతా మంచికిరాలే చెడుకే వచ్చిందని లీడరు కార్మికుల చెవుల ఇల్లుకట్టుకొని చెప్పినా వినేటోడే కనిపిస్త లేడు.... ఇక ఇట్లయితే లాబములేదని బాయిలమీద 'రాడికల్' అని అనుమాన మొచ్చిన వాళ్ళందరి పేర్లురాసి పోలీసులకిచ్చిండ్లు. కాని ఎంతమందిని అరెస్టుచేసినా అసలు వాళ్ళకు అంతులేకుండాపోయింది. ఎవడు 'రాడికలో' ఎవడుకాదో తెలియ కుంటయింది. ఏ లేబరోన్ని చూసిన ఇదివరలా కాకుండా, అదెట్లా ? ఇదెట్లా అని ప్రితిది ప్రిశ్నిస్తుండు? లీడరుగిరి ఇదివరలా లేదు ఏదో సావలేకబ్రితుకుతున్నట్టున్నది" అని బాధపడిపోతున్నరు.

అయినా పడిపోతున్న పలుకుబడిని నిల్పుకోవటానికి చెయ్యగల్గింది అంతా చేస్తునే ఉన్నరు. చివరికి తమకు అనుకూలమైన అనుచర బృందాన్ని తాగబోయించి ఆరోజు ఫస్టుసిఫ్టుకో పనిలోకి దించాలని చూసిండ్లు. దాంతో 'సమ్మెవద్దు' అనేవాల్లకు సమస్య పరిష్కా-రము అయ్యేంతవరకు దిగేదిలేదనే వారికి ఘర్షణ జరిగింది పట్టు పట్టి దిగడానికి సిద్దపడ్డవాడొకడు బాగాతాగ్రి "నాదిఏం పీకుతరో పీకుండ్లి నేను దిగుతా నంటు" దిగపోయిండు.

"ఆ లంజకొడుకును అపుండ్లెహ.... బాయిలు సక్క-గనడ్చినప్పుడు ఇంట్ల పంటడు బాయిబందున్న రోజున బాగాతాగొచ్చి దిగుతనంటడు...." బక్క-గాపొడుగ్గా ఉన్న కార్మికుడొకడు.

710

"వాన్ని గుంజుకరాండ్డి.... వాని మత్తుగిత్తంతా వదిలిపోవాలి" మందిలనుండి అరిచిండొకడు అరిచిండు.

"చూస్తారేమి కానియ్యి"

గుంపుమధ్యలో యిరుక్కపోయిండు దిగటాన్కి ప్రయత్నంచేసిన కార్మికుడు.

బలం కల్ల కార్మికుడొకడు వాన్ని ఎత్తిపట్టిండు బాగ అందరికీ అగుపించాలని మెడలో పాతబూట్ల దండతో హఠాత్తుపరిణామానికి చిత్తరవయిపోయిన వాన్ని చూసి దూరం దూరంగా నిల్చున్నవారు కిసుక్కునసవ్వింద్లు.

నిముషాలమీద జర్గిన ఈ గందరగోళాన్ని చూసి పోలీసులు లాటీలు ఊపు కుంటు వచ్చేసరికి కార్మికులు ఎక్కడివారు అక్కడ జారుకున్నరు.

అంతవరదాక బాయిమీదున్న చంద్రయ్యను రాయలింగు జరఇంటిదాక రమ్మంటూ పిల్చుకపోయిండు. వాళ్ళరెండో అమ్మాయిని చూడవత్తాండ్లంటే కాదన కుంటా పెళ్ళిండు. అక్కడనుండి అవే మాటమాట మాట్లాడుకుంటాపోయి కల్లుబట్టీ కూసున్నరు.

సాయిలు ఆరాలు తీసుకుంటు కల్లుదుకాణ్లకు వచ్చేసరికి రాయలింగు, చంద్రయ్య ఊగుకుంటు అదేపనిగా వాగుతు కల్లుబట్టీనుండి బయటికివస్తు కనిపించింద్లు.

సాయిలు ఆగముఆగంగా జర్గినసంగతి చెప్పేసరికి చంద్రయ్యకు తాగినమైకము దిగిపోయింది. 'అయితే పోల్లను ఎటుతీస్కపోయింద్లు' గాబరాపడిపోతు అడిగిండు.

"బెల్లంపల్లికి తీస్కపోవచ్చు అందరు బెల్లంపల్లికి తీస్కపోయుంటరని అంటాంద్లు"

"అయితె నేను బెల్లంపల్లికిపోత"

"జర ఇంటిదాక వచ్చిపోరాదు వదిన ఒక్కతీర్గఏడుస్తాంది" అని చంద్రయ్య అన్నమాటలు విన్పించుకోక జేబులో డబ్బులులేకుంటే సాయిలుదగ్గర అడిగితీసుకొని అప్పుడే వచ్చిన 'టెంపో'లో కాలుపెట్టసందులేకున్నా దూరిండు.

తీరా బెల్లంపల్లికిపోయి వంగతేందో తెల్సుకుంటే 'అర్ధగంటముందు వచ్చిన జయంతి జనతా' ఎక్స్ ప్రెస్‌లో "హైదారాబాద్ తీస్కపోయింద్లని అక్కడ కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు పంపిస్తరని "రైల్వేఉద్యోగి ఒకడు చెప్పిండు."

711

చేసేది ఏమిలేక తిర్గి ఇంటికొచ్చిండు. ఆ రోజంతా ఇంట్ల ఏడ్పులు అరుపులతోనే గడిపింది. పొయిమీద ఎసరుపెట్టలేదు. పిల్లలకుమాత్రం పక్కింటి కొమురమ్మ తీస్కపోయి బువ్వతినిపించింది.

తెల్లారితె హైద్రాబాద్‌కు పోవాలని ఆరాత్రి ఊరు ఊరంతా తిరిగిండు చంద్రయ్య డబ్బుకోసము. ఎవరిని అడిగిన 'లేదన్న' జవాబే. స్ట్రయిక్ జర్గె రోజుల్లో ఎవరిదగ్గరమాత్రం పైసలుంటయని. చివరికి ఎటుతోసక ఇంట్లో కొప్పెరఉంటె తీస్కపోయి కుదువపెట్టిండు. ఎంతోబతిమిలాడంగ అరువైరూపాయలకంటె ఎక్కువ రావన్నడు వడ్డీలకిచ్చె షావుకారు. కొప్పెర కుదువబెట్టినందుకు మరోసారి అయితె లచ్చిమి లొల్లిపెట్టేదే కాని ఇప్పుడు కిమ్మనకుండా ఉండిపోయింది.

మరురోజు ఇదేకేసులో హైద్రాబాద్‌కువస్తున్న హుసెన్‌తోకల్సి బయలుదేరిండు. అక్కడికి చేరినతరువాత మరోనల్గురు కల్సిండ్లు. అంతకల్సి విచారణచేస్తున్న కోర్టుకు వెళ్ళేసరికి పదయింది. పదకొండింటికి విచారణ జరుగుతుందనితెల్సి ఈ లోపు లాకపురూమ్‌లో ఉన్నవాళ్ళను చూడాలనుకుంటె పోలీసుజవాను అడ్డుతగిలిండు. చివరికి తలోరూపాయి చేతులోపెట్టి కేసువివరాలుచెప్పి ఏమంత ప్రమాదమైన కేసు కాదని నిర్ధారణ చేసుకున్నతరువాత జవాను ఒక్కొక్కరినిపోయి కల్సిరమ్మన్నడు.

మల్లమ్మ తండ్రినిచూసి అప్పటివరకు సన్నగాఏడుస్తున్నదల్లా బాగాఏడ్వటము మొదలు పెట్టింది.

చంద్రయ్యకు కళ్ళలో గిర్రున నీళ్ళుతిర్గినయి. అయినా ధైర్యముతెచ్చుకొని "ఏడ్వకుబిడ్డా నిన్ను తీస్కపొయెందుకు వచ్చిన" అంటూ ఊరడిస్తూ సలాకుల మధ్యగా తలమీదచెయ్యేసి అదిరిపడ్డడు. ఒళ్ళంతా జ్వరముతో కాగిపోతాంది. గుబ గుబ నీళ్ళు పొంగివచ్చినయి.

లాకపులోఉన్న ముసలాయన "నిన్నటి నుంచి ఏమి తింటలేదు. బెంగపెట్టు కొన్నదేమో ఒక్కటేఏడ్పు. రాత్రంత జ్వరమే. లోకంమీద న్యాయంలేదుబిడ్డా ఏం పాపం చేసినమని...." ముసలాయన ఏదో చెప్పబోతున్నాడు. కాని జవాన్ వచ్చి ఏంటీఅల్లరి ఉత్తగచూడుండ్లి అంటె ఏడ్పులుమొదలుపెట్టిండ్లు. నడవుమంటు చంద్రయ్యను తోసుకుంటు పోయిండు. "కోర్టుకుతీస్కవస్తము మీరంతా అక్కడికి పోండి. ఎందుకేడుస్తవు. మంచి మంచికేసులు కొట్టుకుపోయినయి. అంతో ఇంతో జరుమానవేసి వదిలిపెడ్తరు." చంద్రయ్యను చూపి జవాను అన్నడు.

712

విచారణ మొదలైంది. కోర్టుహాల్‌లోకి జనం నిండుకొంటున్నరు. యథా విధంగా పంకలు తిరుగుతూనే ఉన్నాయి. గోడమీద గాంధీగారు మాసిపోని చిలక నవ్వు నవ్వుతూనే ఉన్నాడు. జడ్జిగారు యాంత్రికంగావచ్చి కుర్చీలో కూలబడ్డడు. తల మీద మిగిలిపోయిన వెంట్రుకలు గాలికి రెపరెపలాడుతున్నాయి. లాయర్లు నల్లకోటు సవరించుకుంటు హడావిడిగా తిర్గుతున్నరు.

మొట్టమొదటిసారి విచారణ కొచ్చిన ఆవారకేసు సెక్షను 109 కింద రాత్రి బస్‌స్టాండులో నిద్దురపోతున్న వారిని పట్టుకొచ్చారు. పోలీసులు కొత్తగావచ్చిన పెద్ద పోలీసాఫీసర్ ఒకాయన తన నిర్వాకము ప్రజలందరికి తెలియాలని క్రింది వాళ్ళకి ఆర్డర్స్ జారిచేసారు. "ఈనెల చివరివరకు ఎలాగైనా నాలుగుపందల కేసులు బుక్ చేయాలని" దాంతో పోలీసులు ఊరుమీదపడ్డరు.

జడ్జిగారు గుమస్తాయిచ్చిన కాగితాలను చూసిండు. కోర్టుజవాను అర్థంకాకుండా ఎవరిపేర్లో పిలిచిండు. ఎనిమిది మందిదాక తీసుకొచ్చి బోనులో నిలబెట్టిండ్రు పోలీసులు జడ్జిగారు సన్నని పెదాలిప్పి "మీరంతా రాత్రి అనుమానాస్పద పరిస్థితిలో తిరుగుతుంటే తీస్కవచ్చినట్టు మీమీద కేసుపెట్టారు. మీరేమన్నా చెపుతారా?" మెల్లగా చిన్నగా నాజూగ్గా అడిగిండు.

ఆ మాటలకు అందులో కొందరు బయటికంటే జేల్లోనే ఇంత తిండిదొరుకుద్ది అనుకునేవారు అవునన్నట్టూ తలూపిండ్లు.

వారిలో మాసిపోయిన గడ్డము. మట్టికొట్టుకపోయిన గుబురు తల. చెమటతో అట్టలు కట్టుకపోయిన మాసిపోయిన మాసికల చేతినంచిగల నడీడుమనిషి "అయ్యా బాంచెను ఒక్కమాటచెప్పాలె. మా పొల్లదానికి ప్రాణము బాగాలేకుంటే ప్రభుత్వ దావఖాన్ల సరీకుచేసిండ్లని మతలాబువస్తె. చూసిపోతమని వచ్చిన. వచ్చేటాల్లకు పొద్దుపోయింది. రాత్రిపూట దావఖాన్లకు పోనియ్యకుంటే వచ్చి బస్సుస్టాండుల పండుకున్నబాంచెను. గారాత్రే పోలీసులు పట్టుకొచ్చిండ్లు బాంచెను గంటకుమించి ఏంలేదు. పొల్లది ఎట్లున్నదోఏమో? యిడ్చిపెడ్తె ఎల్లిపోత బాంచెను."

జడ్జిగారు ఆ మాటలు విన్నరోలేదో. మరైతే ఒక్కసారి గాజుకళ్ళపెట్టుకొని చూసిండు. అంతలకే ఎస్. ఐ. గారు పి. పి. తో ఏదోమాట్లాడిండు. పి. పి. జడ్జిగారితో ఏదో సగౌరవంగా విన్నవించుకున్నడు. జడ్జిగారు కాగితముమీద ఏదో గిలికిండు. చివరికి అందరిని పదిహేనురోజులు రిమాండ్‌కు పంపిస్తున్నట్టుగా జడ్జిమెంటు వినిపించాడు.

713

ఆ తర్వాత మరో రెండు సైకిల్ దొంగలను విచారించిండు. ఆ తర్వాత బొగ్గు దొంగతనము చేసిన నేరానికిగాను రైల్వేవారి కేసు విచారణకొచ్చింది.

ఆనవాయితీగా పి. పి. మాటలిన్న జడ్జిగారు అందరిని 15 రోజులు రిమాండుకు పంపించాడు.

మల్లవ్వ బెదిరిపోయి భయం భయంగా ఏడుస్తుంది.

చంద్రియ్య నోటిమాటరాక చూస్తుండిపోయాడు. పటపట కన్నీళ్ళు కారుతుండగా బిడ్డకు ధైర్యంచెపుతామని ముందుకుకదిలిండు. కాని పోలీసు జవాను దగ్గరికి రాకుండా నెట్టివేసాడు.

రడీగావున్న వ్యానులోకి ఎక్కించటానికి పోలీసులు తొందర తొందరగా తోలుకపోయిండ్లు.

చంద్రియ్య కోర్టువరండాలో మందిని తోసుకుంటు పరుగెత్తిండు. చివరికి ఎలాగైతేనేమి కూతురును సమీపించి "ధైర్యంగా ఉండుబిడ్డా మళ్ళ నేనువచ్చి తీస్కపోతా" వక్కనేఉన్న ముసలమ్మతో "అవ్వజరకనిపెట్టు రెండురోజులకే బిడ్డనగమైంది పదిహేనురోజులు ఎట్లగడుస్తదో" దుఃఖముతో మాట పెకులలేదు.

'ఏడ్వకుబిడ్డా నేను చూసుకుంటా' ముసల్ది చంద్రియ్యకు ధైర్యముచెప్పింది.

వ్యాన్ కదిలింది

కళ్ళనీళ్ళతో కనుచూపుమేర వరకు చూస్తుండిపోయిండు కోపంతో పెదాలు కొరుక్కున్నడు. చేతివరాలన్ని తెగిపోంగ పిడికిలి బిగించి ఎక్కడలేని కోపముతో కోర్టుముందు రోడ్డుమీద నిలబడి అదేపనిగా తిడ్తున్నడు పిచ్చివానితీరుగా....

(మందమర్రి డివిజన్ లో జరిగిన సంఘటన ఆధారంగా)

## విజ్ఞప్తి

మహోజ్వల శ్రీకాకుళ పోరాటానికి సంబంధించిన కథలను సంకలనంగా తేవాలనే ప్రయత్నంలో ఉన్నాము. ఆ ఉద్యమాన్ని గురించి తెలిసిఉన్న మిత్రులు రాసిగాని, రాయించిగాని తమ కథలను సెప్టెంబర్ నెలాఖరుకల్లా పంపి సహకరించగలరు.

ఏ. రాంబాబు,
C/o ఎ. ఎర్రియ్య, పాన్ షాప్, యం. జి. రోడ్,
విజయనగరం : 531 202.

714